క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): రంజాన్ మాసం పురస్కరించుకుని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ బుధవారం గాయత్రి ఎస్టేట్‌లోని తన క్లినిక్‌లో పేద ముస్లిం మహిళలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసం ఉండటం వల్ల వారికి శరీరంపై, మనసుపై నియంత్రణ కలుగుతుందని, అలాగే ఆధ్యాత్మిక భావన కూడా కలుగుతుందన్నారు. ఈ మాసంలో చేసే దానధర్మాల వల్ల వారికి అంతా మంచి జరుగుతుందని చెప్పారు.

డీసీసీ మాజీ కార్యదర్శి మృతి



బుచ్చిబాబు (ఫైల్)

కర్నూలు(సెంట్రల్): డీసీసీ మాజీ కార్యదర్శి సర్దార్ బుచ్చిబాబు మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్ పార్టీలో జిల్లా ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. సీనియర్ నాయకుడు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి టీడీపీలోకి వెళ్లిన సమయంలో ఆయనతో పాటు వెళ్లారు. తరువాత అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. బుచ్చిబాబు మరణ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కాలయాపన తగదు

కర్నూలు సిటీ: జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేస్తే విచారణ పేరుతో కాలయాపన చేయడం తగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సోమన్న, ఎస్.సాబీర్ బాషలు అన్నారు. బుధవారం ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన విద్యార్థి సంఘాల నాయకులతో దురుసుగా మాట్లాడిన ఆర్ఐఓపై చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కర్నూలు: న్యాయవాది మహేంద్రనాథ్ రెడ్డి పట్ల అనుచితంగా వ్యవహరించిన కర్నూలు త్రీటౌన్ సీఐ, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బుధవారం విధులు బహిష్కరించి సీఐ, ఎస్ఐలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చట్టం మేరకు న్యాయవాదులు ప్రశ్నిస్తే పోలీస్‌స్టేషన్‌లో అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో మురళీమోహన్, హరినాథ్ చౌదరి, చంద్రుడు, బాలు, కృష్ణమూర్తి, సంపత్, కాశీ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థకు ఆకాశవాణి విశ్రాంత ఉద్యోగి రంగస్వామి పుస్తకాలను వితరణ చేశారు. ఘంటసాల పాడిన పాటలు, పద్యాల పుస్తకాలను బుధవారం గ్రంథాలయ సంస్థ అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవిందరెడ్డి, లైబ్రేరియన్ నసీమాబీకి అందజేశారు.

పీఎం అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు (టౌన్): జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగా అభివృద్ధి, ప్రచారంలో అత్యుత్తమ సహకారం అందించినందుకు 2025 సంవత్సరానికి ప్రధాన మంత్రి అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకొని సంబంధిత వివరాలను https://innoveteindia.my.gov.in/pmyofaawards2025 వెబ్‌సైట్‌కు ఈనెల 31వ తేదీలోపు పంపాలని సూచించారు.

28న మీ సమస్య - మా పరిష్కారం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నియోజకవర్గ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఈ నెల 28వ తేదీన తన కార్యాలయంలోని శ్రీ ఆర్య ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు మీ సమస్య–మా పరిష్కారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి టీజీ భరత్ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రైతుబజారులో దళారుల ఇష్టారాజ్యం

- బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోరు
- తూకాలు సక్రమంగా వేయరు
- నిజమైన రైతులకు చోటు కష్టమే



సీ.క్యాంపు రైతుబజారులో తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలు



రైతుబజారు ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సి.క్యాంపు రైతుబజారులో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా రు. బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోరు. తూకా లు సక్రమంగా వేయరు అంటూ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సి.క్యాంపు రైతుబజారు రాష్ట్రంలోని ప్రధాన రైతుబజార్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీ, బీజేపీ, జనసేన నేతలే దళారులను ప్రోత్సహిస్తున్నారు. వారి అండదండలతో దళారులు చెలరేగిపోతున్నారు. దళారులను కట్టడి చేసేందుకు ప్రయత్నించే సిబ్బందిపై తిరుగబడుతుండటం గమనార్హం.

రైతుబజారులో కూరగాయలు, ఆకుకూరలు విక్రయిస్తున్న వారిలో 96 శాతం మంది దళారులే ఉంటున్నారు. ఇక్కడ దళారులు తిష్టవేసి నిజమైన రైతులను లోపలికి రానివ్వరు. కూరగాయలను విక్రయానికి తెచ్చిన రైతులు వాటిని దళారులకు అడిగిన ధరకు విక్రయించుకొని పోవాల్సిందే. ఎవ్వరైనా ఒకరిద్దరు రైతులు రైతుబజారులో అమ్ముకోవడానికి ప్రయత్నిస్తే వారిని ముప్పు తిప్పలు పెట్టి చుక్కలు చూపిస్తారు. కర్నూలు, కల్లూరు, ఓర్వకల్, వెల్దుర్తి తదితర ప్రాంతాల నుంచి కూరగాయలు, ఆకు కరలు తెచ్చిన రైతులను లోనికి రానివ్వకుండా బయటనే దళారీలు కొంటారు. రైతుల నుంచి తక్కువ ధరలకు కొని అక్కడే బోర్డుపై రాసిన ధరలను ఏ మాత్రం పట్టించుకోకుండా అధిక ధరలకు విక్రయిస్తుండటం గమనార్హం. అలాగే వినియోగదారుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తూకాల్లో దగా చేయడం, బోర్డుపై రాసిన ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించడం నిత్యకృత్యం అయింది.

బోర్డు ధరలను పట్టించుకుంటే ఒట్టు

రైతుబజారులో బోర్డుపై రాసిన ధరకే కూరగాయలను విక్రయించాలని మైకు ద్వారా అనౌన్స్‌మెంటు చేస్తున్నా పట్టించుకునే వారు లేరు. దీనికి తోడు తూకాల్లోనూ చేతివాటం ఎక్కువైంది. ఆదివారం రైతుబజారు వినియోగదారులతో కిటకిటలాడింది. బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోవడం లేదంటూ... తూకాల్లో దగా చేస్తున్నారంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో రైతుబజారు ఎస్టేటు అధికారి కళ్యాణి అప్పటికప్పుడు తూనికలు, కొలతల శాఖ అధికారులను పిలిపించి కాటాలు చెక్ చేయించారు. దాదాపు 25 కాటాలు తనిఖీ చేయగా పలువురు కాటాలకు అనుమతి ముద్ర వేయించుకోలేనే విషయం బయటపడింది. తూకాల్లోనూ తేడాలు వెలుగు చూశాయి. దీంతో ఐదు కాటాలను స్వాధీనం చేసుకున్నారు.

హోల్‌సేల్‌గా కొనడం.. రిటైల్‌గా అమ్మడం

సెంటు భూమి లేని వందలాది మంది కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు కొని రైతుబజారులో రిటైల్‌గా అమ్ముకుంటున్నారు. కొంతమంది దళారులు రైతుల నుంచి కూరగాయలు కొని వారిని రైతుబజారులోకి రాకుండానే పంపిస్తుండటం గమనార్హం. రైతుబజారులో మార్కెట్‌లో ఆకు కూరలు తెచ్చుకొని అమ్ముకునే వారి నుంచి రోజుకు రూ.30, పాదుపు మహిళలు రూ.200, పూలు అమ్ముకునే వారు రూ.50, పండ్లు అమ్ముకునే వారు రూ.60 ప్రకారం వసూలు చేస్తున్నారు. రైతుల ముసుగులో దళారులు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా రైతుబజారులో తిష్ట వేసి బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోకపోవడం, తూకాల్లో దగా చేయడం, రైతుబజారు సిబ్బంది పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే కుటుంబంలో ఎంత మంది ఉంటే అందరికి స్టాళ్లు ఉన్నాయంటే దళారులు ఏ స్థాయిలో పాతుకపోయారో తెలుస్తోంది. భార్య, భర్త, కూతురు, కుమారులు ఇలా అందరు స్టాళ్లు దక్కించుకున్నారు.

రైతులకు దక్కని చోటు

రైతుబజారులో కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, పూలు తదితర వాటిని అమ్ముకునే వారు దాదాపు 400 మంది ఉన్నారు. ఇందులో పట్టుమని 10 మంది కూడా రైతులు లేకపోవడం గమనార్హం. నిజమైన రైతులు ఒకరిద్దరు ఉంటే వారిని పొమ్మనలేక పొగపెట్టడం నిత్యకృత్యమైంది. రైతులు తాము తెచ్చుకున్న వాటిని దళారీలకు అప్పగించి పోవాల్సిందే. లేకపోతే వారిని స్థిమితంగా కూర్చోనివ్వరు. నిబంధనల ప్రకారం రైతుబజారులో కూరగాయలు అమ్మకోవాలంటే పొలం ఉండాలి. కూరగాయలు సాగు చేస్తూ ఉండాలి. కూరగాయలు సాగు చేస్తున్నట్లుగా హార్టికల్చర్ కన్సల్టెంటు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సి ఉంది. అటువంటి రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తారు. వారు మాత్రమే కూరగాయలు అమ్ముకోవాల్సి ఉంది. ఇది రైతుబజారులో అమలు కావడంలేదు. సెంటు పొలం లేని దళారీలు ఇటు రైతుల నుంచి అటు కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో కొని తెచ్చుకొని అమ్ముకుంటున్నారు.

కూరగాయలు అమ్ముకోవాలంటే చుక్కలు చూపిస్తున్నారు



మాకు సొంత భూమి ఉంది. అలాగే కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని బెండ, సొర, బీర పండిస్తున్నాం. వీటిని రైతుబజారులో అమ్ముకుందామని వచ్చాం. అయితే దళారులు వాటిని అమ్ముకోకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఇక్కడ మాకు అడ్డం అక్కడికి తీసుకపో.. అక్కడికి పోతే ఇక్కడ వద్దు ఇంకోచోటికి వెళ్లిపో అంటున్నారు. తెచ్చిన వాటిని కూడా అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. దీనిపై రైతుబజారు ఆఫీసులో ఫిర్యాదు చేశాం.

– చెన్నయ్య(జోసెఫ్), రైతు, మిలిటరీ కాలనీ

ఉగాది తర్వాత దళారులను కట్టడి చేస్తాం



నేను ఎస్టేటు ఆఫీసర్‌గా వారం రోజుల క్రితమే జాయిన్ అయ్యాను. ఇంకా రైతుబజారును పూర్తిగా అవగాహన చేసుకోలేదు. ఉగాది తర్వాత దళారులను ఏమి చేయాలనే దానిపై దృష్టి సారిస్తాం. రైతుబజారులో నిజమైన రైతులకు న్యాయం చేయాలనేది తమ ప్రధాన లక్ష్యం. బోర్డుపై రాసిన ధరలను తూచా పాటించాల్సిందే. తూకాల్లో దగా చేస్తే వారిని బయటికి పంపిస్తాం.

– కళ్యాణి, ఎస్టేట్ అధికారి, సి.క్యాంపు రైతుబజారు

రహదారి భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు: అంకుల్.. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించండి.. నాలుగు చక్రాల వాహనం నడిపేటప్పుడు విధిగా సీటు బెల్టు ధరించండి.. అంటూ రహదారి భద్రత నిబంధనలు, హెల్మెట్ వినియోగంపై కర్నూలు ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులతో కలిసి అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం మైపర్ బీ–ఫార్మసీ, నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన 50 మంది విద్యార్థులచే రాజీవిహార్ సెంటర్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి.. వేగం కన్నా ప్రాణం మిన్న.. అంటూ ముద్రించిన ప్లకార్డులు, బ్యానర్లను చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు.

ప్రవక్త బోధనలు అనుసరణీయం



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): చెడుపై యుద్ధం ప్రకటించి ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చిన ప్రవక్త బోధనలు అందరికీ ఉపయుక్తం అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక 5వ వార్డులోని హాజీ–సా–మసీదులో వైఎస్సార్‌సీపీ నాయకులు సిరాజ్ ఆహ్వానం మేరకు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. దువా చేశా రు. ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొ న్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, నీలకంటూ, ముస్తఫా, అక్బర్, శంకర్, చాంద్, వనేష్, మహేంద్ర, బండిమెట్ట మధు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేవీఆర్‌లో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. యూనివర్సల్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 18 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కట్టా వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ బెల్ట్‌లు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

30న ఉగాది సంబరాలు

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్‌లోని హరిహర క్షేత్రంలో ఈనెల 30వ తేదీ సాయంత్రం 6 గంటలకు విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాగ శ్రవణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పండుగ నిర్వహణ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండితులు క్లో వేణుగోపాల్ శర్మ పంచాగ శ్రవణం చేస్తారన్నారు.

పన్నులు తగ్గించే వరకు పోరాటం



నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు (టౌన్): పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నిర్మల, రాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ధర్నా నిర్వహించారు. పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగు నీటి సమస్య పరిష్కరించాలని, రద్దయిన క్లాప్ ఆటోలను పునరుద్ధరించాలని, అదనంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులకు పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో లేదన్నారు. పారిశుద్ధ్య కార్మికుల కొరత వల్ల మురుగు సమస్య నెలకొందని, జీఓలు 196, 197, 198లను రద్దు చేయాలని, ఇంటింటికీ చెత్త సేకరణ కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నగర నాయకులు సాయిబాబా, సుధాకరప్ప, నరసింహులు, విజయ్, షరీఫ్, అబ్దుల్లా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీకాతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులకు సమయానుసారం టీకాలు ఇప్పించాలని డెమో శ్రీనివాసులు శెట్టి సూచించారు. ఆయన బుధవారం శ్రీరామనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నారాయణరెడ్డి నగర్ 62వ సచివాలయంలో వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతాశిశు సంరక్షణ కార్డులో సూచించిన తేదీల ప్రకారం క్రమం తప్పకుండా టీకాలు ఇప్పించాలన్నారు. టీకాలు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. దీనిపై ప్రజలకు, తల్లులకు ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. వడదెబ్బ నివారణ గురించి వివరించారు. వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం 10 గంటల్లోపు పనులు ముగించుకుని నీడ గల ప్రదేశాల్లో ఉండాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు శారద, అనిత, ఆశా కార్యకర్తలు వెంకటరమణమ్మ, నాగమణి పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు అన్యాయం'



ధర్నా చేస్తున్న ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు అన్యాయం జరిగిందని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ అన్నారు. ఈ మేరకు బుధవారం ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్గీకరణను 2011 జనాభాను ఆధారంగా చేసుకొని విభజన చేయడంతో మాదిగలకు 6.5 శాతం, మాలలకు 7.5 శాతం, ఇతరులకు 1 శాతం రిజర్వేషన్ వచ్చిందన్నారు. దీనివల్ల మాదిగలకు అన్యాయం జరుగుతుందన్నారు. 2026లో చేపట్టే కులగణన వరకు మాలలు, మాదిగలకు సమాన ప్రతిపాదికన రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జేసీ డాక్టర్ బి.నవ్యకు వినతి పత్రం అందించారు. నాయకులు భైరాపురం రాజు, మీసాల బాబు, సూరిబాబు, దేవిపుత్ర, రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు సీ.క్యాంపు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సి.క్యాంపు రైతుబజారులో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నట్లుగా ఎస్టేటు ఆఫీసర్ కళ్యాణి, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 27న రైతుబజారులో పారిశుద్ధ్యాన్ని పెంపొందించే పనులు చేపడుతున్నందున ఒక రోజు బంద్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 28 నుంచి యథావిధిగా రైతుబజారు పని చేస్తుందని వారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 27న పలు ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. కిడ్స్ వరల్డ్ ఫీడర్ పరిధిలోని షరాఫ్ బజారు, పోస్టాఫీసు, దామోదరం సంజీవయ్య ఉన్నత పాఠశాల వరకు, అర్బన్ బ్యాంకు ఫీడర్ పరిధిలోని కడక్‌పురా, అర్బన్ బ్యాంకు, మించిన్ బజారు ఏరియా, డీపీఓ ఫీడర్ పరిధిలోని ఎస్పీ ఆఫీసు, గాలిగేరి, కొత్తపేట ప్రాంతాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాజీ కార్పొరేటర్‌కు నివాళి

కర్నూలు(సెంట్రల్): మాజీ కార్పొరేటర్ జి.రమణ మ్మ ఆశయ సాధన కోసం కృషి చేస్తామని సీపీఎం నాయకులు టి.రాముడు, అరుణ, అలివేలు పేర్కొ న్నారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో జి.రమణమ్మ 12వ వర్ధంతి పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేపర్ మిల్ ఉద్యమం నుంచి పార్టీ ఉద్యమం వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండాను మోసిన చరిత్ర ఆమెకు ఉందన్నారు. పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు అనేక భూపోరాటాల్లో పాల్గొందని చెప్పారు. కార్యక్రమంలో బాల లక్ష్మీ, రేణుక, మద్దిలేటి పాల్గొన్నారు.

గిరిజన యువతకు శిక్షణ ఇవ్వాలి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని నిరుద్యోగ గిరిజన యువతకు స్వయం ఉపాధి పథకాల ఏర్పాటుకు సంబంధించి ప్రత్యేక శిక్షణా కార్యాక్రమాలను ఏర్పాటు చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక సెట్కూరు కార్యాలయంలో సీఈఓ డాక్టర్ కే.వేణుగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. చంద్రప్ప మాట్లాడుతూ.. గిరిజనుల విద్యార్హతలను అనుసరించి ఉపాధి అవకాశాలను కల్పించాలని, బ్యాంకులతో ప్రమేయం లేకుండా రుణాలను మంజూరు చేయించాలన్నారు. నాయకులు అంజినాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ బకాయిలు చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): వీబీసీఎల్ కార్మికులకు పీఎఫ్ బకాయిలు చెల్లించాలని ఆ కంపెనీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఆదిశేషన్న డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో పీఎఫ్ ఆఫీసర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2012 నుంచి పీఎఫ్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ చెల్లించేలా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. నాయకులు భాస్కరరెడ్డి, లక్ష్మన్న, ఆనంద్, ప్రసాదు, అంజనమూర్తి, సుంకన్న పాల్గొన్నారు.

28న 'భారత రాజ్యాంగం' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో 'భారత రాజ్యాంగం' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని జేవీవీ కార్యదర్శి ప్రతాపరెడ్డి తెలిపారు. 'డీలిమిటేషన్' వరమా.. శాపమా అనే అంశంపై సెమినార్ ఉంటుందని పేర్కొన్నారు. జేవీవీ వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్ రమేష్ ప్రధాన వక్తలుగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు.

గుక్కెడు మంచినీళ్లు ఇవ్వలేరా?



మాట్లాడుతున్న మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): ప్రజలు తాగు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. గుక్కెడు మంచి నీళ్లు ఇవ్వలేరా? అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ అధికార యంత్రాంగాన్ని ప్రశ్నించారు. ఆయన బుధవారం సి.క్యాంపులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ.. ఎండాకాలంలో మంచి నీటి సమస్య వస్తుందని ముందే తెలిసినా ప్రభుత్వ యంత్రాంగం సరైన చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో ఆలూరు నియోజకవర్గంలోని 6 మండలాలు, పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి, లింగంనేనిదొడ్డి, పెద్దొడ్డి, బోయ దొంతిరాళ్ల, అటికెల గుండు, పెండ్లిమాన్ వంటి అనేక గ్రామాల్లో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. జిల్లాలో ఎండలు మండుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయని, బోర్లు ఎండి పోయాయన్నారు. దీంతో గ్రామాల ప్రజలు మంచినీటి కోసం కిలోమీటర్ల మేర నడిచి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మరోవైపు పశువులకు నీరు, మేత అందించలేక వాటిని అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి గ్రామానికి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సద్వినియోగం చేసుకోండి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని టీజీ వెంకటేష్ ఇండోర్ స్టేడియాన్ని విద్యార్థులు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు సూచించారు. రూ.10 లక్షలతో ఆధునీకరించిన స్టేడియాన్ని బుధవారం వీసీ ప్రారంభించారు. రిజిస్ట్రార్ డాక్టర్ విజయ్‌కుమార్‌నాయుడు, వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ శివకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేసే పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారు. వీరికి బుధవారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ నరసింహం జూమ్ ద్వారా పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ శివబాల నాగాంజన్, రేడియాలజీ విభాగం డాక్టర్ రాధికకు పదోన్నతులు కల్పించి కర్నూలులోనే కేటాయించారు. జనరల్ సర్జరీ విభాగం డాక్టర్ విజయబాబును నంద్యాలకు, డాక్టర్ మాధవకృష్ణను వైఎస్సార్ జిల్లాకు బదిలీ చేశారు.

ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు అభ్యర్థుల ఎంపిక

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులకు ఇస్తున్న ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు సంబంధించి రెండవ దశ షార్ట్ లిస్టను https://mdfc.apcfss.in వెబ్ పోర్టల్‌లో ఉంచినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జే.రంగలక్ష్మిదేవి తెలిపారు. ఈ లిస్ట్‌లో ఉన్న అభ్యర్థులు జ్ఞానభూమి వెబ్ పోర్టల్‌లో ఆప్షన్ సర్వీస్ ద్వారా ఎంప్యానెల్డ్ కోచింగ్ సంస్థలకు తమ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియను ఈ నెల 28వ తేదీలోగా పూర్తి చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ పోర్టల్‌లో ఎడిట్ ఆప్షన్ లేదని జాగ్రత్తగా నమోదు చేసుకోవాలని సూచించారు.

అన్నమాచార్యుల వర్ధంతి

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో బుధవారం వాగ్గేయకారుడు అన్నమాచార్యుని 522వ వర్ధంతి నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య నిలయం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేంకటేశ్వర స్వామి, అన్నమయ్య చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులు అన్నమయ్య కీర్తనలను ఆలపించి నృత్యాలను ప్రదర్శించారు. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు.

ఏడీఏపై చర్యలు నిలుపుదల

కర్నూలు (అగ్రికల్చర్): 2005–06లో డోన్ మండల వ్యవసాయ అధికారిగా పనిచేసిన అన్నపూర్ణా దేవి వేరుశనగ విత్తనం పంపిణీలో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం తదుపరి చర్యలను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం ఈమె జిల్లా వనరుల కేంద్రంలో ఈడీగా పనిచేస్తున్నారు. డోన్ మండలంలో ఏఓగా పనిచేసేటప్పుడు విత్తన పంపిణీలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ అధికారులు పలు దఫాలుగా విచారణ జరిపారు. ఎట్టకేలకు ఈమెపై తదుపరి చర్యలను ఉపసంహరించుకుంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పాస్టర్ మృతిపై నిజాలు నిగ్గుతేల్చాలి

కర్నూలు (టౌన్): పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని క్రైస్తవ సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం రాత్రి 9 గంటలకు స్థానిక గిప్సన్ సెంట్రల్ బాప్టిస్ట్ చర్చి నుంచి పాస్టర్లు, క్రైస్తవులు ర్యాలీగా ఆర్ఎస్ రోడ్డు, మౌర్యా ఇన్ సర్కిల్, రాజీవిహార్ సెంటర్‌కు చేరుకున్నారు. మానవ హారం నిర్వహించి మోకాళ్లపై ప్రార్థనలు చేశారు. పాస్టర్లు కృపాదానం రాజు, జోసఫ్ నోయల్, వినోద్ జోషి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.